క్లుప్తంగా

సచివాలయాల తనిఖీ



గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలోని సచివాలయాలను శనివారం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులతో పాటు సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయంలో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించాలన్నారు. ఆఫీస్ సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. శనివారం కోడుమూరులోని ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.అలాగే నాడు-నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు పెట్టే భోజనాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయులు పరిశీలించి నాణ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు జగిలి మహేంద్ర (37) శనివారం గుండె పోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాణ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుణాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బాలిరెడ్డి, షేక్షావలి, శేషారెడ్డి, శేషయ్య, కిట్టు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

ఓర్వకల్లు: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన వసతులు, పరిశుభ్రత అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు తోట అనూష, ఏపీఓ వెంకటరామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పాల్‌రెడ్డి తాత రథోత్సవం

గూడూరు రూరల్: మండలంలోని గుడిపాడు గ్రామంలో శనివారం అప్పాల్ రెడ్డి తాత రథోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక సీతా రాముల ఆలయంలో అప్పాల్ రెడ్డి తాత ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం రథంపై ఉంచి భక్తుల నినాదాల మధ్య రథాన్ని కదిలించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఓర్వకల్లు: మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామం వద్ద శనివారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.5,900 నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



గడివేములలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా నందికొట్కూరు-నంద్యాల రోడ్డు

భానుడి భగభగలు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- బయటకు వచ్చేందుకు జంకుతున్న ప్రజలు
- మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా రహదారులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



గడివేముల: ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు వేసవి తీవ్రత పెరుగుతోంది. నాలుగైదు రోజుల నుంచి సూర్యుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. దీంతో పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం గడివేముల మండలంలో అత్యధికంగా 39.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో కూడా దాదాపు అదే పరిస్థితి ఉంది. ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే మేలో ఇంకెంత భయంకరంగా ఉంటాయోనని నియోజకవర్గ ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికే చాలా మంది ఎండదెబ్బకు బయటకు రాలేకపోతున్నారు. దీంతో మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గడివేముల, పాణ్యం మండలాల్లో బోరుబావులు, కాలువల కింద వివిధ రకాల పంటలు సాగు చేశారు. అయితే, ఎండవేడికి వ్యవసాయ కూలీలు మధ్యాహ్నం 12 గంటలకే ఇంటికి తిరిగి వస్తున్నారు. కొందరు భానుడు ప్రతాపాన్ని తట్టుకునేందుకు శీతలపానియాలతో పాటు, కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును వాడాలి. పలుచటి తెలుపు రంగు కాటన్ వస్త్రాలను ధరించాలి. తలకు టోపీ పెట్టాలి లేదా రుమాలు కట్టుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఆరుబయట అధిక శ్రమతో కూడిన పని చేయకూడదు. అవసరం ఉంటే తప్ప ఇంటి నుంచి బయటకు రావాలి. మంచినీరు, మజ్జిగ, నిమ్మరసంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, శీతల పానియాలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వారికి వెంటనే వైద్యపరీక్షలు నిర్వహించాలి. ఎక్కువగా నీరు,ద్రవ పదార్థాలను సేవించాలి. అలాగే ఇంటి గదులు ఉష్ణోగ్రతను తగ్గించటానికి కిటికీలు, తలుపులకు తెరలను ఏర్పాటు చేసుకోవాలి. ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

వడదెబ్బ సోకే ప్రమాదం



రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. నెలాఖరు లోపు ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండలో పనిచేసేవారికి, తిరిగే వారికి వడదెబ్బ సోకే ప్రమాదం ఉంది. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశంలోకి చేర్చాలి. తడి గుడ్డతో శరీరాన్ని తుడిచి చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. మజ్జిగ లేదా ఓరల్ రీ హైడ్రేషన్ (ఓఆర్ఎస్)ద్రావణం తాగించి వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి.స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాము.

– డాక్టర్ మొల్లా జబీన్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి,గడివేముల



ఎండవేడిమి తట్టుకునేందుకు కలింగర పండు తింటున్న ప్రజలు

త్వరలో రైతులకు భూ హక్కు పత్రాలు

కర్నూలు (న్యూటౌన్): మండలంలో భూముల రీ సర్వే శనివారంతో పూర్తయిందని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహశీల్దార్ శివరాముడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో ఉన్న 82,632 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని అన్నారు. ఇక డిజిటల్ రికార్డులను సిద్ధం చేసి రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. భూముల రీ సర్వేకు మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సంపూర్ణ సహకారమందించారని తెలిపారు. భూముల రీ సర్వేలో డిప్యూటీ తహసీల్దార్ శారద, వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్ఏలు ప్రతి రోజు పాల్గొని సకాలంలో పూర్తి చేయడం అభినందనీయమన్నారు.

వాల్మీకుల మహాప్రదర్శనకు తరలిరండి

కర్నూలు(న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఈనెల 2వ తేదీన కర్నూలులో తలపెట్టిన వాల్మీకుల మహా ప్రదర్శన, సభకు కోడుమూరు నియోజకవర్గం నుంచి వాల్మీకులు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే సుధాకర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు తన స్వగృహం నుంచి నగరంలోని వాల్మీకి సర్కిల్ (ధర్నా చౌక్) వరకు భారీ ప్రదర్శన ఉంటుందన్నారు.

కబడ్డీ విజేత శకునాల

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో శకునాల జట్టు విజేతగా నిలిచింది. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానిక బైరెడ్డి నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో శకునాల జట్టు తొలి స్థానంలో నిలిచి రూ.20 వేలు, రెండవ స్థానంలో వంచలింగాల జట్టు నిలిచి రూ.15 వేలు, మూడో స్థానంలో హుసేనాపురం జట్టు నిలిచి రూ.10 వేలు, నాలుగో స్థానంలో శకునాల జూనియర్ జట్టు నిలిచి రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందుకున్నాయి. కార్యక్రమంలో కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, గోపా మోహన్‌రెడ్డి, జీకే వెంగన్న, రామకృష్ణ, చంద్రయాగంటి, మద్దిలేటి, రంగడు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో నిర్వాహకులు

మహిళల అభ్యున్నతికి సీఎం కృషి





పొదుపు మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నగర మేయర్ బీవై రామయ్య, ఆసరా వేడుకలకు హాజరైన మహిళలు

- సంక్షేమ పథకాల్లో వారికి అధిక ప్రాధాన్యం
- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య
- పొదుపు మహిళలకు 'ఆసరా' వరం
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గూడూరు పట్టణంలో శనివారం వైఎస్సార్ మూడవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మెప్మా సీఎంఓ సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు హాజరయ్యారు. ఈసందర్భంగా బీవై రామయ్య మాట్లాడుతూ సీఎం మహిళా పక్షపాతి అని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకంలో వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం వరం లాంటిదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పొదుపు రుణాలు మాఫీ చేశారన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, ఇలా ప్రతి పథకం ద్వారా వారికి లబ్ధి చేకూర్చుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకుందని చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ ఎల్. వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం పట్టణంలోని 325 డ్వాక్రా గ్రూపుల్లోని 3,727 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత కింద రూ.2,27,09,330 చెక్కును అందించారు. అంతకు ముందు సీఎం జగన్ చిత్ర పటానికి మహిళలు పాలాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు, కౌన్సిలర్లు ఖలీల్, మద్ది, బజారి, నంద కిషోర్, కిషోర్, కుమార్, విజయుడు, నాయకులు దండు శ్రీను, ప్రవీణ్, ప్రతాప్, ముకుంద, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

కోడుమూరు రూరల్: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అవసరమైన మంచినీరు, కరెంట్, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులను మంజూరు చేయడంతో పాటు, ఇసుక, ఐరన్, సిమెంట్ వంటి వాటిని అందజేస్తోందన్నారు. లబ్ధిదారులంతా త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని డీఈఈ పేర్కొన్నారు.



ప్యాలకుర్తిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు

సి.బెళగల్: గృహ నిర్మాణాల వేగవంతమయ్యేలా చూడాలని ఏఈ సుమంత్ హౌసింగ్ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని కొండాపురంగ్రామంలో పర్యటించి జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

సి.బెళగల్: శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మారందొడ్డి గ్రామంలో శనివారం పాలపళ్ల ఎద్దులు బండలాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన సీతారాముడు ఎద్దులు విజేతగా నిలిచి రూ.30 వేలు, సి.బెళగల్ మండలం సంగాల గ్రామానికి చెందిన పైయింటి రాముడు, పోలకల్ గ్రామానికి చెందిన మహేంద్ర నాయుడు సంయుక్త ఎద్దుల జత రెండవ స్థానంలో నిలిచి రూ.20 వేల బహుమతిని కైవశం చేసుకున్నాయి. మూడో స్థానంలో గూడూరు మండలం మునగాల గ్రామానికి చెందిన అంజనమ్మ ఎడ్లు (రూ.15 వేలు),నాలుగో స్థానంలో అస్పరి మండలం చెట్నేపల్లికి గ్రామానికి చెందిన ఈరన్న, దేవనకొండ మండలం కోటకొండ గ్రామానికి చెందిన గోపాల్ సంయుక్త ఎడ్లు (రూ.10 వేలు), ఐదవ స్థానం పాములపాడు మండలం చిలమ్ముల గ్రామానికి చెందిన ప్రసాద్ ఎడ్లు (రూ.5 వేలు) సొంతం చేసుకున్నాయి. విజేత ఎడ్ల యజమానులకు గ్రామ పెద్దలు, ఉత్సవాల నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రుక్మాంద, రాఘవేంద్ర, రామాంజనేయులు, అంజి, లక్ష్మన్న, గిడ్డయ్య, అంజిన తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మునిసిపల్ కమిషనర్ బదిలీ

గూడూరు: స్థానిక మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు గుత్తి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు శనివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కమిషనర్ బదిలీ నేపథ్యంలో కార్యాలయ మేనేజర్ రవికుమార్‌కు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు.

నేడు మాసమసీదులో ఆసరా వారోత్సవాలు

కర్నూలు (న్యూటౌన్): మాసమసీదులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ - ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం) మల్లికార్జునస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. పొదుపు గ్రూపు లీడర్లు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం

గడివేముల: వందలాది వాహనాలతో రద్దీగా ఉండే నంద్యాల-నందికొట్కూరు రోడ్డులోని గడివేముల పాత బస్టాండ్ వద్ద శనివారం రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అయితే, అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ స్తంభాలు, తీగలు రోడ్డుపై పడగానే స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాగా దెబ్బతిన్న స్తంభాలను మార్చకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు.



గడివేముల పాత బస్టాండ్ ప్రాంతంలో కూలిన విద్యుత్ స్తంభాలు

వేధింపుల కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన ఆవుల మాధవి ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు అత్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. నంద్యాల పట్టణం సాధిక్‌నగర్‌కు చెందిన ఆవుల జయప్రకాశ్‌తో మాధవికి నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో బాధితురాలి శనివారం పోలీసులను ఆశ్రయించారు. భర్తతో పాటు అత్త హేమలతపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భయం వీడి పరీక్షలు రాయండి

సి.బెళగల్: పదోతరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలని, అప్పుడే మంచి మార్కులు వస్తాయని ఎంపీడీఓ రాముడు, ఎస్ఐ పీరయ్య అన్నారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని బీసీ హాస్టల్‌లో పదవ తరగతి విద్యార్థులకు దాతలు పరీక్ష సంబంధ వస్తులను అందజేశారు. హాస్టల్ వార్డెన్ రాముడు అధ్యక్షతన జరిగిన సరస్వతి పూజలో వారు పాల్గొని పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఎలా రాయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలన్నారు.

ప్రతి గడపకూ వెళ్లండి

- సంక్షేమ పథకాలపై అభిప్రాయాలు సేకరించండి
- ఈవిషయంలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయరాదు
- వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారథులతో ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ఈనెల 3 వ తేదీ నుంచి గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అభిప్రాయాలు సేకరించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రం పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పాణ్యం , గడివేముల మండలాల సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారథులతో ' జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ఎంత వరకు అందాయి, వాటి వలన ఎన్ని కుటుంబాలు లబ్ధిపొందాయనే విషయాన్ని తెలుసుకునేందుకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పార్టీ ప్రారంభించిందన్నారు. దీంతో పాటు క్షేత్ర స్థాయిలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానన్నారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలన్నారు.

రైతులకు వాస్తవాలు తెలియజేయండి

వ్యవసాయం గత ప్రభుతంలో ఎలా ఉండేది ఇప్పుడు ఎలా ఉందనే దానిపై రైతులకు స్థానిక పార్టీ నాయకులు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. 2014 నుంచి 2019 వరకు శ్రీశైలం నుంచి సాగునీటి విడుదల ఎలా ఉండేది వివరించాలన్నారు. టీడీపీ హయాంలో నీళ్ల కోసం రైతులు నానా ఇబ్బందుల పడ్డారన్నారు. పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలు మూటగట్టుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పుష్కలంగా సాగునీరు అందుతుండటంతో ఏటా రెండు కార్ల పంటలు పండించుకుంటున్నారన్నారు. బాబు హయాంలో కరువు విలయతాండవం చేసేదన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా లభించేది కాదని, దీంతో చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడా ఆపరిస్థితి లేదన్నారు.




పాణ్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా

ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన పాణ్యం నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీలు ఉసేన్‌బీ, నాగ మద్దమ్మ, గడివేముల జెడ్పీటీసీ ఆర్‌బీచంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, శివరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, క్రిష్టారెడ్డి, పాలం చంద్రశేఖర్‌రెడ్డి , బాబు, జార్ ఉసేన్, ప్రదీప్‌రెడ్డి, రవిరెడ్డి, వడ్డుగండ్ల రాముడు, భాస్కర్‌రెడ్డి, తొగర్చేడు శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, రామచంద్రుడు, కృష్ణారెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి , ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య

కల్లూరు: ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కారుపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, నగర మేయర్ బీవై రామయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో కల్లూరు అర్బన్, గ్రామీణ, ఓర్వకల్లు మండలాల కన్వీనర్లు, నాయకులతో జగనన్ననే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రజా సంక్షేమాన్ని వారు గాలికొదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్న పాలన గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిపన్న, ఓర్వకల్లు, కల్లూరు జెడ్పీటీసీలు రంగనాథ్ గౌడ్, ఆల ప్రభాకర్ రెడ్డి, అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కె.వి. రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు అర్బన్, గ్రామీణ, ఓర్వకల్లు మండలాల జేసీఎస్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కేశవరెడ్డి, లోటర్ బాషా, రెండు మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్లూరులో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు